క్లుప్తంగా

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: నిరుపేదల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు నండూరి జయరాజు జయంతిని పురస్కరించుకుని చెంచుపేటలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్.పార్థ, ఎన్.మహారాజు, ఎస్.తారకరాజు, డి.సురేష్, కె.శ్రీధర్, జి.రాము, టి.రవి పాల్గొన్నారు.

పిల్లలకు వైద్యశిబిరం

తెనాలి: మండలంలోని జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య వీవర్స్ కమ్యూనిటీ హాలులో పిల్లల ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ పిల్లల వైద్యశాల న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 179 మంది పిల్లలకు పరీక్షలు చేశారు. డాక్టర్ రాధికా రాజశేఖర్ కుప్పా, డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ అఖిల్ గారపాటి సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచి కంభం బాలాజీ, న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా హాజరయ్యారు.

నూర్‌బాషా సంఘీయుల ఆత్మీయ సమావేశం

తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం దూదేకుల నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తాడిబోయిన హరిప్రసాద్, షేక్ చిన మస్తాన్, షేక్ బాజీ, దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు దూదేకుల బాజీ, కార్యదర్శి చిన్నవలి, కమిటీ సభ్యులు షేక్ జాన్ సైదా, షేక్ దాదావలి, షేక్ బాషు, మహబూబ్ సుభానీ, షేక్ చాంద్, షేక్ బాబావలి, షేక్ నబి, షేక్ పీరు, షేక్ జానయ్య, షేక్ బుజ్జి, షుకూర్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై పోలీసులకు ఫిర్యాదు



తెనాలిటౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు, నారా లోకేష్‌పై తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, ప్రజలకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని రూరల్ ఏఎస్‌ఐ హైమారావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులు ఎస్.బుజ్జిబాబు, ఎల్.చినబాబు, చుండూరు గోపి, ఆదం షఫీ ఉన్నారు.

అధిక లోడు లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. తెనాలి మండలం పెదరావూరు వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆదివారం గుర్తించారు. లారీ యజమానికి రూ.10 వేల జరిమానా విధించారు.

సోమేశ్వరస్వామి ఆలయం సందర్శన

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరంలోని గంగాబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం ఆంజనేయ యోగ మండలి సభ్యులు సందర్శించారు. దేవాలయాల పరిశుభ్రత యోగం కార్యక్రమంలో భాగంగా యోగమండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ, సభ్యులు ఆలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, కె. నాగరాజు, కోమల, నాగేశ్వరరావు, లక్ష్మి, పురుషోత్తమకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

జీయర్ ట్రస్ట్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారి దీర్ఘాయువు ఆయుర్వేద హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం అతి పురాతనమైనదని, మహర్షులు ప్రసాదించిన వైద్యమని అన్నారు. ఈ వైద్యశిబిరంలో విశ్వ ఆయుర్వేద పరిషత్ ప్రెసిడెంట్ డాక్టర్ పూర్ణరాజేశ్వరి, డాక్టర్ నల్లు ధరణి కుమార్ తమ వైద్యసేవలను అందించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వృద్ధులకు చీరల పంపిణీ

మంగళగిరి: నగరానికి చెందిన దామర్ల శివరామకృష్ణ-రామసీతమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని శ్రీ మార్కండేయ పద్మశాలీ కల్యాణ మండపంలో సుమారు 900 మంది పేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. దామర్ల రామసీతమ్మ తొమ్మిదో వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వెనిగళ్ల ఉమామహేశ్వరి, మాచర్ల పద్మావతి, ఊట్ల పద్మజ, దామర్ల భాగ్యలక్ష్మి, దామర్ల శివరామకృష్ణ, డీఎస్ఎస్ శ్రీనివాసరావు, వెనిగళ్ల శివప్రసాద్, మాచర్ల భానుప్రసాద్, ఊట్ల సత్యనారాయణ, దామర్ల శోభన్ బాబు, ఆకురాతి కిరణ్ పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం మండలం కేంద్రం కొల్లిపరలో శ్రీచౌడేశ్వరి అమ్మవారి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆయన స్థానిక నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.ఐదు లక్షల మంజూరు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ కార్యాలయం సమీపంలో రోడ్డు నిర్మాణానికి కూడా మరో రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచి పిల్లి రాధిక, ఉపసర్పంచి అవుతు కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, నాయకులు కల్లం వీరారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, అన్నవరపు రమేష్, పుచ్చకాయల మోహన్‌రెడ్డి, ఈదా వెంకటేశ్వరరెడ్డి, నీలం శ్రీనివాసరావు, దండే పుల్లయ్య, నీలం పూర్ణచంద్రరావు, నీలం సుధాకర్ రావు పాల్గొన్నారు.

సమాజ సేవలో మానవతకు పెద్దపీట

'మానవత' రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: సమాజ సేవలో మానవతకు పెద్దపీట వేయాలని, ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో మానవత సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానాన్ని ప్రోత్సహించటం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం, పర్యావరణ పరిరక్షణ అంశాలతో పాటు విద్యార్థి వయసులోనే నైతిక విలువలు పెంచేలా ప్రణాళికను రూపొందించి, అమలు చేద్దామని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, మంచి వ్యక్తుల కలయికతో సమాజంలో తోటివారికి సేవచేయాలనే స్ఫూర్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సభ్యులు ఆ దిశగా కృషిచేయాలని కోరారు. రక్తదానాన్ని ప్రోత్సహించే క్రమంలో రక్తదాతలతో జాబితాను సిద్ధం చేసినట్టు తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కల్యాణి మాట్లాడుతూ సేవను ఆచరించటం ద్వారా జీవితానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. 'పోస్ట్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ, మానవతలోని మహిళా సభ్యుల్లో అవసరమైనవారికి ఉపాధిని పొందే నైపుణ్య శిక్షణను తమ సంస్థలో ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మానవత ఆధ్వర్యంలో రూపొందిస్తున్న పర్యావరణ హిత సంచుల తయారీ ఖర్చును భరిస్తానని చెప్పారు. సమావేశంలో డాక్టర్ జి.నాగేశ్వరరావు, వేదాంతం ఫణీంద్ర, సీబీ రమణ, పాలుడుగు ఆనందరావు మాట్లాడారు.

మిత్రమా.. కుశలమా !



గురువుల సత్కారంలో 1998-99 బ్యాచ్ విద్యార్థులు

నగరంపాలెం: ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. 1998–99లో టెన్త్ చదివిన వారంతా అనాటి స్మృతుల్ని నెమరువేసుకున్నారు. అప్పట్లో పాఠశాలకు విద్యార్థులుగా వచ్చిన వారు.. ప్రస్తుతం వారి కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, స్నేహితుల్ని పిలుచుకున్న అల్లరి పేర్లను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏయే వృత్తుల్లో ఎక్కడెక్కడ స్థిరపడ్డారు.. కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం అప్పటి గురువుల్ని ఘనంగా సత్కరించారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కదిరి సంజీవరావు, షేక్ షాజహాన్, పరసా ఆంజనేయులు, బి.నాగరాజు, షేక్ నజీర్, హైదరాబాద్, చెన్నై, వైజాగ్, గుంటూరుతో పాటు వివిధ చోట్ల నుంచి పూర్వ విద్యార్థులు రావడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

తోపుడు బండ్లు అందజేత

మంగళగిరి: నగరంలోని ఇద్దరు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయంతో తోపుడు బండ్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, సాలి ప్రశాంత్ పాల్గొన్నారు.

చినకాకానిలో...

కార్పొరేషన్ పరిధి చినకాకానికి చెందిన ఇద్దరికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయంతో తోపుడు బండ్లు అందజేశారు.

పవర్ లిఫ్టర్ షబీనాకు అభినందనలు

మంగళగిరి: వరల్డ్ సబ్ జూనియర్, జూనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో పతకాలు సాధించిన తెనాలికి చెందిన పవర్ లిఫ్టర్ ఎస్‌కే షబీనాను కోచ్ ఎస్‌కే సంధానీ ఆదివారం అభినందించారు. అభినందించిన వారిలో సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు కొమ్ము కుల విజయ భాస్కరరావు, బి.ప్రసాద్ ఉన్నారు.

మళ్లీ మోటార్ల చోరీ

తాడేపల్లిరూరల్: మోటారు దొంగలు తమ చేతివాటాన్ని మరోసారి ప్రదర్శించడంతో కుంచనపల్లికి చెందిన చిన్న, సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఆదివారం తెల్లవారుజామున ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి పంటపొలాల్లో ఐదు విద్యుత్ మోటార్లు చోరీకి గురి అయ్యాయి. గత నెల రోజుల క్రితం ఇదే ప్రాంతంలో వరసగా విద్యుత్‌మోటార్లు చోరీకి గురికావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. పోలీసులు కొంచెం గస్తీ పెంచడంతో కొంత కాలం గప్‌చిప్‌గా ఉన్న దొంగలు తిరిగి మరల తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రాతూరు, కుంచనపల్లి రహదారిలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే తాము ఇక వ్యవసాయం చేయలేమంటూ ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్క మోటారు రూ.50 వేలకు పైబడి ఉంటుందని, మళ్లీ కొత్త మోటార్లు కొని బిగించే స్తోమత లేదని అంటున్నారు. విద్యుత్ మోటార్లు చోరీకి గురి అయిన ప్రాంతాన్ని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు.

గంగానమ్మ బోనాల పండుగ

మంగళగిరి: శ్రావణమాసం రెండో ఆదివారాన్ని పురస్కరించుకుని గంగానమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

అందమైన చేతిరాతతో అధిక మార్కులు

ఫిరంగిపురం: అందమైన చేత రాతతో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించవచ్చని పాఠశాల హెచ్‌ఎం కమలప్రసాద్ అన్నారు. మండలంలోని బేతపూడి జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులకు(లుసిడా హ్యాండ్ రైటింగ్)శిక్షణ ఆదివారం ఇచ్చారు. కమలప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ తీసుకుంటే మేలు చేకూరుతుందని చెప్పారు. ఉపాధ్యాయుడు బి.సురేష్ మాట్లాడుతూ చేత రాతను బట్టి విద్యార్థుల మనస్తత్వాన్ని అంచనావేయవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులకు శిక్షకుడు షేక్ ఝున్నూ మాస్టర్ అక్షరాలు రాసే విధానం గురించి వివరించారు. విద్యార్థులతో రాయించారు. కార్యక్రమంలో ఎస్ఏ, ఉపాధ్యాయుడు పి.థామస్ రెడ్డి, శిక్షకులు మానస, కీర్తన, జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి



విద్యార్థినులకు రిపోర్టులు, మందులు పంపిణీ చేస్తున్న భానుమతి

తెనాలిఅర్బన్: మహిళలకు వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ రాష్ట్ర కన్వీనర్, సిద్ధార్థ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ దుర్గారాణి సూచించారు. ఐఎంఏ తెనాలి మిషన్ పింక్, హ్యాపీ హాస్పిటల్స్, జేఎంజే కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సులో బాలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. మహిళలకు సంభవించే క్యాన్సర్‌పై హ్యాపీ హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థినులకు డాక్టర్ శ్వేతా, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ లావణ్య, డాక్టర్ ఉష వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్.సరోజిని, సిస్టర్ ఏమిలి, సిస్టర్ అమూల్ మేరీ, సిస్టర్ విజయ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

కొల్లిపర ఎంపీపీ పద్మావతి



క్రీడాపోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొల్లిపర: విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని ఇందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఈషా ఫౌండేషన్ నిర్వహిస్తున్న 15వ గ్రామోత్సవం క్రీడాపోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ నిర్వాహకులు కుందుల సుధాకర్, సాంబశివరావు, వివేకా విద్యాసంస్థల అధినేత వీరనారాయణ, గ్రామస్తులు అవుతు కృష్ణారెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లు చేస్తున్న మహిళల అరెస్టు

పట్నంబజారు: మన ప్రాంతం వాళ్లు కాదు... చూడగానే అర్థమైపోతుంది.. నలుగురైదుగురు కలసికట్టుగా వాహనాల్ని నిలిపి వేస్తున్నారు.. పిచ్చి రాతలు రాసిన కాగితాలను చూపించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.. ఇవ్వకుంటే నేరుగా జేబుల్లో నుండి లాక్కుంటున్న పరిస్థితులు.. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఆఖరిని వారిపై కేసులు నమోదు చేశారు. కొత్తపేట, పాత గుంటూరు పోలీసుస్టేషన్ల సీఐలు షేక్ అన్వర్ బాషా, ఎం.వి. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లా సోజత్ రోడ్ నుంచి 13 మంది మహిళలు ఏడుగురు పసిపిల్లలతో కలసి రెండు రోజుల కిందట విజయవాడకు వచ్చారు. మ్యాజిక్ పుస్తకాలు అమ్ముతున్నామని చెప్పి, రోడ్డు మీద పోయే వారి ఆపి, తమ ఊరి వారు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం గుంటూరుకు చేరుకుని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మల్లేశ్వర డార్మెటరీలో రూముల్ని అద్దెకు తీసుకున్నారు. రోడ్ల పైకి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్న నేపథ్యంలో సమాచారం అందుకున్న పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా డబ్బులు వసూలు చేయడంపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి బలవంతపు వసూళ్లు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సీఐలు అన్వర్ బాషా, ఎం.వి. సుబ్బారావు తెలిపారు.

కవులు భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలి

డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు



శేషాచారికి సత్కారం

పాత గుంటూరు: కవులు భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలని రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు-రమణ-బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కవిమిత్రుల సంగమం-కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు రచయిత్రి సీహెచ్.సుశీలమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ కథ, కవిత, మరి ఏ ఇతర రచన అయినా సమాజ కల్యాణానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడితేనే దానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు. సాహిత్య సృజనలో రచయితలు, కవులు, తమ ప్రాంత అస్తిత్వాన్ని మరువకూడదని చెప్పారు. అనంతరం ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి రచించిన 'మా పెనుగొండ కథలు' పుస్తకాన్ని రచయిత పెనుమాక నాగేశ్వరరావు సమీక్షించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని బి. జనార్ధనరెడ్డి నిర్వహణలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు కవితల్ని వినిపించారు. తెలుగు భాషా ప్రాశస్త్యం కవిత చదివిన మొరుమూరి శేషాచారికి ఉత్తమ కవితా బహుమతి అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ , పత్రికా ఎడిటర్ గోలి సీతారామయ్య, డాక్టర్ రమణ యశస్వి, నిర్వాహకులు బండికల్లు జమదగ్ని, సయ్యద్ జానీ బాషా పర్యవేక్షించారు.

గంజాయి మత్తులో విద్యార్థుల వీరంగం

- దేవాలయం వద్ద వస్తువులు ధ్వంసం
- అడ్డుకున్న రైతులపై దాడికి యత్నం
- పోలీసులకు ఫిర్యాదు
- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటం-వడ్డేశ్వరం పొలిమేర డొంకల్లో స్థానిక యూనివర్సిటీ విద్యార్థులు గంజాయి మత్తులో రైతులు, వ్యవసాయ కూలీలపై దాడికి యత్నించారు. ఆదివారం సాయంత్రం బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న వినాయకుని గుడి వద్ద ఉన్న కూర్చునే బల్లలతో పాటు తాగునీటి పంపు, గుడిలో గంటను ధ్వంసం చేశారు. పక్కనే ఉన్న రైతు ప్రశ్నించడంతో అతడిని కొట్టేందుకు ప్రయత్నించగా ఆ రైతు అక్కడి నుంచి వెళ్లి గ్రామంలో మిగిలిన రైతులను తీసుకొచ్చాడు. ఆ సమయంలో వినాయకుడి గుడి వద్ద కూర్చునే బల్లలను పైకిలేపి కిందకు విసిరి వేస్తూ మల మూత్ర విసర్జన చేశారు. ఇదేమని ప్రశ్నించగా వారిపై తిరగబడే ప్రయత్నం చేశారు. అందరూ అడ్డుకోవడంతో పోలీసులకు రూ.5 లక్షలు ఇస్తాం, బయటకు వస్తాం మీరేమీ చేయలేరంటూ బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురిచేశారు. చదువుకునే వారికి ఇది తగదని రైతులు చెప్పడంతో రైతులపై రాళ్లు విసిరారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి 15 మందిని, 3 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

సమర భేరిని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర పభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమరభేరిని జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కోరారు. దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడిలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.450 ఉండేదని, అధికారంలోని వచ్చిన తరువాత ఇప్పుడు రూ.1200 వరకు పెంచారని అన్నారు. మండల నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల పేరుతో వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడం, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతోందని విమర్శించారు. ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు ప్రజావ్యతిరేక విధానాలపై ఇంటింటికీ తిరుగుతూ జరిగే సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమరభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.పాములు, వై.శివయ్య, వై.బంగారుబాబు, వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీ బాలగణపతి ఉత్సవ సేవా సంఘం ప్రతినిధులు

మంగళగిరి: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆదివారం నగరంలోని బీఆర్ స్కూల్ సెంటర్‌లో బాలగణపతి ఉత్సవ సేవా సంఘం అధ్యక్షుడు బిట్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.అబద్దయ్య, యు.శివన్నారాయణ, పి.లక్ష్మణరావు, ఎం.రాము, కె.శేషగిరి, కె.గిరి, ఆర్. దుర్గారావు పాల్గొన్నారు.

పుస్తకమే సామాజిక చైతన్యపు వారధి



బుక్ స్టాల్ ప్రారంభిస్తున్న విశ్రాంత అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తకమే సామాజిక చైతన్య వారధి అని, రాజ్యాంగంపై పట్టు సాధించడం ద్వారా సామాజిక స్థితిగతుల్ని అధ్యయనం చేయవచ్చని విశ్రాంత ఐఏఎస్ ఆర్. సుబ్బారావు, విశ్రాంత ఐఆర్ఎస్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేట ఐదో లైనులో కుల నిర్మూలన కలయిక సంఘ (ఏసీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుక్ స్టాల్‌ను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్గదర్శకత్వాన్ని అందిపుచ్చుకున్న కాన్షీరామ్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగమనే ఆయుధాన్ని ధరించాలంటే, దానిపై పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. పుస్తకం జీవితానికి మార్గదర్శకమని, దాని ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేన్ జిల్లా అధ్యక్షుడు దేవరాజ్ మాట్లాడుతూ ఏసీఎఫ్ ఆధ్వర్యంలో జరగబోయే రాజ్యాంగంపై అవగాహన పరీక్షకు అవసరమైన పుస్తకాలు బుక్ స్టాల్‌లో ఉంటాయని తెలిపారు. ఇకపై ప్రతి కార్యక్రమానికి పుస్తకం కానుకగా ఇచ్చే సంప్రదాయానికి నాంది పలుకుదామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాధికారి పిల్లి రమేష్, విశ్రాంత డీఎస్పీ రవికుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏజీ ఆఫీస్ సూపరింటెండెంట్ సుబ్బారావు, రిటైర్డ్ ఆర్ అండ్ బీ డీఈ సుధాకర్, ఎలక్ట్రికల్ డీఈ రాజమోహన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నుంచి నరసరావుపేట మోటారు సైకిల్‌పై వెళ్తుంగా మేరికపూడి గ్రామశివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయపడిన దానియేలు బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పరపాలేనికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చల్లా కిషోర్ కేసు నమోదు చేశారు.

పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

చేబ్రోలు: గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా మాధుర్యం అంశంపై గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కె.సృజిని, పి.దుర్గాభవాని వ్యాస రచన, సామెతల వివరణ పోటీల్లో ప్రతిభ చూపారు. కలెక్టరు ఎం.వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు.

కొనసాగుతున్న ప్రతిష్టా మహోత్సవాలు

తాడికొండ: తాడికొండలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థాన పరివార దేవాలయ జీర్ణోద్ధరణ సహిత పునః ప్రతిష్టా మహోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం యాగశాలలో వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఇళ్లలో చోరీల కేసుల్లో ఆరుగురు నిందితుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితుల్ని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌వో హైమారావు వివరాలు వెల్లడించారు. స్టేషన్ పరిధిలో వరుసగా మూడు చోరీలపై కేసులు నమోదయ్యాయన్నారు. దర్యాప్తులో కేవీపీ కాలనీకి చెందిన ఎం.దావీదు, షేక్ జాఫర్ సాదిక్, రాకడి కుమార్, బోతపాటి జగన్, ఎల్ఆర్ కాలనీకి చెందిన రెడ్డి జెమినీరాం, బలుసుపాటి విజయ్‌దుర్గను ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నల్లపూసల గొలుసు, బంగారు నెక్లెసు, ఉంగరం, నాలుగు సెల్ ఫోన్లు, రెండు కెమెరాలు, రూ.2 వేలతో పాటు పలు గృహోపకరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.